ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శుక్రవారం 6 సెప్టెంబరు 2024

ఇటు గోదావరి


పెదమల్లంలో ప్రవాహం


ఏలూరు-కైకలూరు మధ్య ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న కొల్లేరు

ముంచేస్తోంది

- తెలంగాణ, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, ఒడిశాల్లో భారీ వర్షాలు
- పొంగుతున్న ఉపనదులు.. గోదావరిలోకి భారీగా వరద జలాలు
- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక దిశగా ప్రవాహం
- కుక్కునూరు-వేలేరుపాడు మండలాలకు పొంచివున్న ప్రమాదం
- నీట మునిగిన పలు గ్రామాలు, రాకపోకలు బంద్
- పోలవరంలో నీటమునిగిన కడెమ్మ స్లూయిజ్ గేట్లు
- ధవళేశ్వరంలో తొమ్మిది లక్షల క్యూసెక్కుల నీటి విడుదల
- ముంపులో కనకాయలంక కాజ్ వే.. పడవలపై రాకపోకలు
- వశిష్ఠకు పెరుగుతున్న ఉధృతి.. నరసాపురం-సఖినేటిపల్లి రాకపోకలు బంద్


కనకాయలంక కాజ్‌వేపై నీరు.. బోటులో ప్రయాణం

వేలేరుపాడు/కుక్కునూరు/పోలవరం/ఆచంట/యలమంచిలి/నరసాపురం, సెప్టెంబరు 5: తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నదికి వరద పోటెత్తుతోంది. తాళిపేరు, శబరి ఉప నదుల పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు లక్షలాది క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. చత్తీస్‌ఘడ్‌లో భారీ వర్షాల కారణంగా తాళిపేరు నదికి భారీగా వరద చేరుకోవడంతో 16 గేట్లు ఎత్తి దిగువన ఉన్న గోదావరిలోకి 95 వేల క్యూసెక్కుల నీటిని వదిలివేస్తున్నారు. మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలలోని శబరి పరివాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు శబరినదికి భారీగా వరద పొటెత్తుతుంది. శబరి, గోదావరి సంగమం కూనవరం వద్ద శబరి నది ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తోంది. వీటి కారణంగా వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని లోతట్టు ప్రాంతాలకు వరద నీరు చేరుతోంది. భద్రాచలం వద్ద గురువారం సాయంత్రానికి 46 అడుగులకు నీటిమట్టం చేరుకోగా మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను హెచ్చరిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళాలని హెచ్చరికలు జారీ చేశారు. వరద ప్రభావం కారణంగా వేలేరుపాడు మండలంలో 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు - రుద్రమ్మకోట, వేలేరుపాడు-శేపాకగొమ్ము, వేలేరుపాడు-కోయిదా మధ్యగల రహదారులపై వరదనీరు చేరుకోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య పర్యవేక్షణలో లోతట్టు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా అప్రమత్తం చేస్తున్నారు.


గొమ్ముగూడెంలో పునరావాసానికి తరలింపు


కుక్కునూరులో రోడ్లపై వరద నీరు

పునరావాస కేంద్రాలకు తరలింపు

కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామానికి చెందిన దాదాపు 100 కుటుంబాలను దాచారం పునరావాస కాలనీకి తరలిస్తున్నారు. 220 కుటుంబాలకు గాను 100 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. వారం క్రితమే దాచారం పునరావాస కాలనీ నుంచి గొమ్ముగూడెం వాసులు ఇంటికి వెళ్ళారు. అంతలోనే వరద మళ్ళీ ముంచుకురావడం తిరిగి పునరావాస కాలనీకి వెళ్ళే పరిస్థితి ఏర్పడింది. పోలవరంలో గోదావరి నీటిమట్టం పెరగడంతో కడెమ్మ స్లూయిజ్ గేట్లు పూర్తిగా నీటమునిగాయి. దీనిప్రభావం వల్ల తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే మార్గంలో పంట పొలాలు ఈ సీజన్‌లో మూడోసారి నీటమునిగాయి. ఎల్ఎన్‌డీపేట కొవ్వాడ రిజర్వాయర్‌లోకి కొండవాగుల జలాలు చేరడంతో నీటిమట్టం 89.95 మీటర్లకు చేరుకుంది. అదనంగా వస్తున్న 360 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. దీంతో పోలవరం, దొండపూడి గ్రామాల నుంచి కన్నాపురం, జంగారెడ్డిగూడెం మార్గాల్లో సాగిపాడు, కన్నాపురం కల్వర్టులపై వరద జలాలు ప్రమాదస్థాయిలో ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలు బంద్ అయ్యాయి.

మునిగిన కనకాయలంక కాజ్‌వే

ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి గురువారం తొమ్మిది లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెట్టారు. దీంతో వరద ఉధృతి పెరిగింది. ఆచంట మండలం పెదమల్లం, ఆచంట, కరుగోరుమిల్లి, భీమలాపురం పుష్కరఘాట్‌లు నీటి మునిగాయి. యలమంచిలి మండలం కనకాయలంక కాజ్‌వేపై మూడు అడుగుల వరద నీరు ప్రవహిస్తోంది. కనకాయలంక - చాకలిపాలెం గ్రామాల మధ్య ఉన్న కాజ్ వే నీట మునగడంతో గ్రామస్తులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. గోదావరి వరద పెరుగుతున్న దృష్ట్యా ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని నరసాపురం ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్ అన్నారు. కాజ్ వే వద్ద వరద పరిస్థితిని ఆర్డీవో అచ్యుత అంబరీష్ పరిశీలించారు. లంక గ్రామాల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తిచేయాలని తహసీల్దారును ఆదేశించారు. తహసీల్ధారు కె.బాజి సత్యనారాయణ, ఎస్ఐ గుర్రయ్య, వివిధశాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.


నరసాపురం రేవులో నిలిచిన పంటు

వశిష్ఠ ఉధృతి

నరసాపురంలో వశిష్ఠ ఉధృతంగా ప్రవహిస్తోంది. అన్ని స్నానాల రేవుల్లో ప్రవాహం పెరుగుతోంది. నరసాపురం-సఖినేటిపల్లి రేవుల మధ్య రాకపోకల్ని నిలిపివేశారు. లంక గ్రామాల నుంచి కాలేజీలు, స్కూళ్లకు వచ్చే విద్యార్థులు చించినాడ మీదుగా పట్టణానికి చేరుకున్నారు. స్టీమర్ రోడ్ వెలవెలబోయింది. రేవుల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వలంధర్‌రేవు, పిండాల షెడ్ వద్దకు ఎవరిని అనుమతించడం లేదు. మరోవైపు అధికారులు వరద మరింత పెరిగితే మాధవాయిపాలెం స్లూయిస్‌ను మూసివేసేందుకు రెడీ అవుతున్నారు. గోదావరిలో వేటాడే బోట్లన్నీ బుడితలరేవు వద్దకు చేరుకున్నాయి. మరోవైపు వరద వస్తే పొన్నపల్లిలోకి నీరు వచ్చే అవకాశం ఉండటంతో మునిసిపల్ ఆధికారులు మోటార్లు పెట్టేందుకు రడీ అవుతున్నారు. ఆర్డీవో అంబరీష్ గురువారం గోదావరి పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు.

అటు కొల్లేరు

నీట మునిగిన ఏలూరు-కైకలూరు రోడ్డు

- రాకపోకలు రద్దు.. వేరే రూట్లలో బస్సులు
- బాహ్య ప్రపంచానికి దూరంగా లంక గ్రామాలు
- క్షణక్షణం భయం భయంగా గడుపుతున్న ప్రజలు


కొల్లేరు ముంపును పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

కైకలూరు/మండవల్లి/ఏలూరు క్రైం, సెప్టెంబరు 5 : వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొల్లేరు నీటిమట్టం పెరిగి లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. విజయవాడ ఎగువ ప్రాంతాల నుంచి తమ్మిలేరుతోపాటు ఇతర కాలువలు పొంగి పొర్లుతూ ఆ నీరంతా కొల్లేరుకు చేరుతోంది. ఏలూరు-కైకలూరు మార్గమధ్యలోని పెద్దఎడ్లగాడి, పెనుమాకలంక రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది లంక గ్రామాలను గురువారం ఉదయం నుంచే పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. నీరు ఏలూరు - కైకలూరు రోడ్డు వద్ద నీరు పొంగి పొర్లుతుండడంతో వెంటనే వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్, కైకలూరు రూరల్ సీఐ బి.కృష్ణకుమార్, వారి సిబ్బంది ఆ ప్రాంతాలను పరిశీలించారు. ముందస్తుగా రెండు వైపులా పోలీస్ పికెట్లను ఏర్పాటు చేశారు.

ఏలూరు డిపో నుంచి భీమవరం, నర్సాపురం, పాలకొల్లు వెళ్ళే బస్సులను నారాయణపురం, రాచూరు, గణపవరం, భీమవరం మీదుగా పాలకొల్లు, నర్సాపురం పంపిస్తున్నారు. నర్సాపురం-భీమవరం డిపోకు చెందిన బస్సులు ఇదే మార్గంలో ఏలూరుకు వస్తాయి. మరోవైపు కైకలూరు వరకూ భీమవరం, నర్సాపురం బస్సులను అదనపు సర్వీసులుగా తిప్పుతున్నారు. అక్కడ వరకే వచ్చి ఆ బస్సులు తిరిగి వెళ్ళిపోతున్నాయి. కైకలూరు నుంచి ఏలూరు రావడానికి ఎలాంటి అవకాశం లేకపోవడంతో చివరకు ప్రయాణీకులు గణపవరం, రాచూరు, నారాయణపురం మీదుగా వస్తుండగా మరికొంత మంది మండవల్లి, గుడివాడ, హనుమాన్ జంక్షన్, ఏలూరుకు వస్తున్నారు. ఏలూరు నుంచి భీమవరం ఐదు సర్వీసులు ఉండగా, భీమవరం, నర్సాపురం డిపోలు మరో 25 సర్వీసులు కొనసాగిస్తున్నాయి. మొత్తం 60 ట్రిప్పులలో ఆర్టీసీ బస్సులు ఏలూరు - కైకలూరు రోడ్డులో తిరిగేవి. ప్రస్తుతం ఇవి వేరే మార్గాల్లో నడపడంతో ఏలూరు నుంచి కైకలూరు వరకూ వెళ్ళే మార్గమధ్యలో ఉన్న లంక గ్రామాల వారికి ఎలాంటి రవాణా సౌకర్యం అందుబాటులో లేకుండా పోయింది. వరద నీరు పూర్తిగా తగ్గిన తరువాతే అనుమతి ఇచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఏలూరు డిపోకు చెందిన బస్సులను నారాయణపురం, రాచూరు, గణపవరం మీదుగా భీమవరానికి పంపిస్తున్నామని జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎన్‌వీఆర్ వర ప్రసాద్ చెప్పారు. నర్సాపురం, భీమవరం డిపో బస్సులు కైకలూరు వరకూ నడుపుతున్నారని వెల్లడించారు.

బాహ్య ప్రపంచానికి దూరంగా

మండవల్లి మండల కొల్లేటి లంక గ్రామాలు దాదాపు నీట మునిగే పరిస్థితి. ఇప్పటికే గ్రామాల్లో రహదారులు ముంపు బారినపడి బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్నాయి. పెనుమాకలంకకు పెద్దఎడ్లగాడి నుంచి బోటు ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. పెనుమాకలంక, నందిగామలంక, ఉనికిలి, ఇంగిలిపాకలంక, పులపర్రు, తక్కెల్లపాడు గ్రామాల్లోని పలు ప్రాంతాలు ముంపు బారినపడ్డాయి. చింతపాడు, కొవ్వాడలంక గ్రామాలు ముంపు అంచున జీవనం సాగిస్తున్నారు. చింతపాడు నుంచి యాగినమిల్లి వెళ్లే రహదారి పూర్తిగా జలదిగ్బందంలో చిక్కుకుంది. పెద్ద ఎడ్లగాడి వద్ద దిగువకు నీటి ప్రవాహానికి అవరోధంగా ఉన్న గుర్రపుడెక్క తోడును ఎన్డీయే నాయకుడు చాపరాల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో తొలగింపు చర్యలు చేపట్టారు. విజయవాడ నుంచి ఊహించని రీతిలో వరద నీరు ఉధృతి కొల్లేరుకు చేరడంతో కొల్లేటిలంక గ్రామాలు ముంపు బారిన పడుతున్నాయి. ముంపు గ్రామాల్లోని పరిస్థితిని మండవల్లి తహసీల్దార్ గోపాల్ గురువారం పరిశీలించారు. ఐదారు రోజులుగా వర్షపు నీటిలో మునిగిన వరి పొలాలు కుళ్లిపోతున్నాయని రైతులు ఆందోళన చెందారు.

ఆరెంజ్ అలర్ట్

మూడు రోజులు భారీ వర్షాలు

ఏలూరు సిటీ, సెప్టెంబరు 5 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. శుక్రవారం నుంచి మధ్య బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ఏర్పడుతుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే అధిక వర్షాల వల్ల వేలాది ఎకరాల పంటలు నీట మునిగాయి. మళ్లీ అల్పపీడనం కారణంగా భారీగా వర్షాలు కురిస్తే తమ పరిస్థితి ఏమిటని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు ఏలూరు జిల్లాలో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాతావరణ శాఖ ఆరంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది. పశ్చిమ గోదావరిలోనూ ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు.



వేలేరుపాడు రోడ్లపై గోదావరి నీరు


పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి ఉధృతి

దేశ నిర్మాణంలో గురువుల పాత్ర

- ఉపాధ్యాయ దినోత్సవంలో కేంద్ర మంత్రి వర్మ

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5 : దేశ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకమని కేంద్ర భారీ ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. గురువారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల గురు పూజోత్సవం కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన జరిగింది. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ విద్యాధికుడు, తత్వవేత్త, ఉపాధ్యాయుడు అయిన డా.సర్వేపల్లి రాధాకృష్ణన్, ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా దేశ ప్రగతికి విశేష కృషి చేశారన్నారు. విద్యార్థులను ఆదర్శంగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల పాత్రే కీలకమన్నారు. వారిని మార్గదర్శకులుగా, సత్ప్రవర్తన కలిగిన వారుగా తీర్చిదిద్దాలన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడం ద్వారానే ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో వారి పాత్ర ఘనమైందన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి జి.నాగమణి మాట్లాడుతూ విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడానికి విద్యా శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. తొలుత వివిధ పాఠశాలల విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చివరిగా విద్యారంగంలో విశేష కృషి చేసిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి పూలమాలలు వేసి, శాలువా కప్పి మెమెంటో, ప్రశంసా పత్రాన్ని అందజేసి సన్మానించారు. సమగ్ర శిక్ష ఏపీసీ పీవై శ్యాంసుందర్, భీమవరం, తణుకు ఉప విద్యా శాఖ అధికారులు పి.నాగరాజు, డి.మురళీ సత్యనారాయణ, మధ్యాహ్న భోజనం కోఆర్డినేటర్ కృష్ణారావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన కేంద్ర మంత్రి వర్మ, కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీమ్ అస్మి



రెక్కలు.. ముక్కలు

వైసీపీలో వరుస షాక్‌లు

జడ్పీ చైర్మన్ భర్త రాజీనామా.. చైర్మన్ దారెటు

జడ్పీటీసీలు, ఎంపీపీల పక్కచూపులు

మాజీ ఎమ్మెల్యే ఆర్‌ఎస్ ఇకలేరు


నేడు చించినాడలో అంత్యక్రియలు

- 7లో..

దాతలు స్పందించారు

- జిల్లా నుంచి భారీగా ఆహార పదార్థాలు, పాలు, నీళ్లు, బిస్కెట్లు, కూరగాయలు
- విజయవాడ వరద బాధితులకు నాలుగో రోజు పంపించిన కలెక్టర్ నాగరాణి

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5 : వరద బాధితులకు దాతలు అందించిన సహాయం మరువలేనిదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో తయారు చేసిన పులిహోర ప్యాకెట్లు, బిస్కెట్ బాక్స్‌లను పరిశీలించారు. జిల్లా నుంచి గురువారం విజయవాడకు 61,350 ఆహార పొట్లాలు, 82,900 వాటర్ బాటిల్స్, 9,800 బిస్కెట్లు, ఎనిమిది వేల పాల ప్యాకెట్లు, ఏడు వేల బన్నులు, మూడు టన్నుల కూరగాయలు, మూడు టన్నుల నిత్యావసర వస్తువులు, 15 టన్నుల బియ్యం, ఐదు వందల దుప్పట్లు, మూడు వేల రస్కుల ప్యాకెట్లు ప్రత్యేక వాహనం ద్వారా పంపించినట్లు తెలిపారు. ఆహార పదార్థాలు పంపిన వారిలో.. భీమవరం మెరైన్ ఎక్స్‌పోర్ట్ అసోసియేషన్ 12,450 ప్యాకెట్లు, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల 5,100 ప్యాకెట్లు, విష్ణు కాలేజీ, తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి నీరు ల్లివర్తక సంఘం, వాణిజ్యపన్నులశాఖ, దాసం ప్రసాద్, నర్సాపురం స్వర్ణాంధ్ర కళాశాల, తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాల ఐదు వేల ప్యాకెట్లు చొప్పున, తాడేపల్లిగూడెం రెడ్డి సంక్షేమ సంఘం మూడు వేలు, మార్టేరు రెడ్డి సేవా సంఘం 2,500 ఆహార పొట్లాలను, నర్సాపురం ఎమ్మెల్యే ఎనిమిది వేల పాల ప్యాకెట్లు, ఏడు వేల రొట్టెలు, 15 టన్నుల బియ్యం, మూడు టన్నుల కూరగాయలు, మూడు టన్నుల నిత్యావసర వస్తువులు, 500 దుప్పట్లు, స్వీట్స్ ఇతర పదార్థాలు, భీమవరం కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ మూడు వేల బిస్కెట్ ప్యాకెట్లు, నర్సాపురం జడ్జిలు, జ్యుడిషియల్ సిబ్బంది 1800 బిస్కెట్ ప్యాకెట్లు, భీమవరం కేజీఆర్ఎల్ కళాశాల మూడు వేల బిస్కెట్ ప్యాకెట్లు, పాలు, రస్కులు మూడు వేల ప్యాకెట్లు, తాడేపల్లిగూడెం స్టూడెంట్స్ అసోసియేషన్ రెండు వేల బిస్కెట్ ప్యాకెట్లు, 300 ఆహార పొట్లాలు, 200 పాల ప్యాకెట్లు, 1500 వాటర్ బాటిల్స్ అందించినట్లు తెలిపారు.

అలాగే జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు రూ.1.20 లక్షలు, జిల్లా ఖజానా శాఖ రూ.42,500 చెక్కులను కలెక్టరేట్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణి కలిసి అందజేశారు. జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాతరాణి, జిల్లా ఖజానా అధికారి ఆడారి గణేష్ ఐసీడీఎస్ పీడీ బి.సుజాతరాణి తదితరులు ఉన్నారు.


విజయవాడలో వరద బాధితుల కోసం భీమవరంలో పులిహోర తయారు చేసి ప్యాక్ చేస్తున్న విద్యార్థినులు





ఆర్ఎస్ (ఫైల్)

నివాళులర్పిస్తున్న సీపీఎం, ఇతర వామపక్ష నాయకులు..

మాజీ ఎమ్మెల్యే, సీపీఎం నేత ఆర్ఎస్ మృతి

భీమవరం టౌన్,సెప్టెంబరు 5:సీపీఎం పోరాటాల ఉమ్మడి జిల్లాల రథసారథి, మాజీ ఎమ్మెల్యే చించినాడ గ్రామానికి చెందిన రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్ఎస్) (98) గురువారం మధ్యాహ్నం భీమవరంలోని తన పెద్ద కుమార్తె ఇంటి వద్ద తుదిశ్వాస విడిచారు. ఆయన భార్య ఐద్వా జిల్లా నాయకురాలు సూర్యకాంతమ్మ కొన్నాళ్ల కిందట మరణించారు. ముగ్గురు కుమార్తెలలో పెద్ద కుమార్తె భారతి మృతిచెందారు. వృద్ధాప్య రీత్యా ఆయన భీమవరంలోని చిన్న కుమార్తె స్వరాజ్యమాత వద్ద ఉంటున్నారు. కొన్ని రోజులుగా ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఇంటి వద్దే వైద్యం అందిస్తున్నారు. గురువారం ఆయన మృతి చెందారు. ఆర్ఎస్ 1953 నుంచి 1965 వరకు చించినాడ గ్రామానికి సర్పంచ్‌గా పనిచేశారు. 1951లో కమ్యూనిస్ట్ పార్టీ పూర్తికాలం కార్యకర్తగా మారారు. 1965లో నరసాపురం నుంచి సీపీఎం తరపున అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి పరకాల శేషావతరంపై శాసనసభ్యుడిగా గెలుపొందారు. అప్పట్లో శాసన సభలో సీపీఎం ఉప సభానాయకుడిగా పనిచేశారు. సీపీఎం ఉమ్మడి జిల్లాల కార్యదర్శిగా ,రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ప్రజల పక్షాన అనేక పోరాటాలను చేశారు. 1999లో నరసాపురం ఎంపీగా పార్టీ తరుపున పోటీ చేశారు. చించినాడ స్వగ్రామం కావడం రాజకీయ ప్రస్థానం కూడా ఈ గ్రామం నుంచే ప్రారంభం కావడంతో గ్రామంపై ఆయన ఎనలేని ప్రేమాభిమానాలు చూపించేవారు. శుక్రవారం ఉదయం చించినాడలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

11న అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 5: ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఈ నెల 11వ తేదీన ఏలూరు డిస్ట్రిక్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 14 నుంచి 16వ తేదీ వరకు గుంటూరు జిల్లా మంగళగిరి, ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయని తెలిపారు. ఈ పోటీలకు సంబంధించి ఎంపిక పోటీలు ఈ నెల 11న ఉదయం 8 గంటల నుంచి ఏఎస్ఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10,12,14,16,18,20 వయసు గల వారికి, అండర్-23 విభాగంలో బాల,బాలికలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువపత్రం లేదా 10వ తరగతి మార్కుల జాబితా తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. వివరాలకు 62814 31202 నంబర్లో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

12న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

ఏలూరుసిటీ, సెప్టెంబరు 5: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజాపరిషత్ 1 నుంచి 7 వరకు స్థాయి సంఘ సమావేశాలు ఈనెల 12 వతేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఏలూరులోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు జిల్లా ప్రజా పరిషత్ సీఈవో సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.



సర్వేపల్లి చిత్రపటం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేస్తున్న అన్ ఎయిడెడ్ అధ్యాపకులు

అన్ ఎయిడెడ్ అధ్యాపకుల నిరసన

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 5 : ప్రభుత్వాలు మారుతున్నా అన్ ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులకు న్యాయం జరగక మోసపోతూనే వున్నారని విచారం వ్యక్తం చేస్తూ గురుపూజోత్సవం సందర్భంగా అశోకనగర్‌లోని ఎస్.పీ.డీ.బీ.టీ జూనియర్ కళాశాల అన్ ఎయిడెడ్ అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నిరసన తెలిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, అధ్యాపకులు ప్రేమ్‌కుమార్, రమేష్, జయశంకర్ తదితరులు మాట్లాడుతూ అన్ ఎయిడెడ్ లెక్చరర్లు చాలీచాలని జీతాలతో దుర్భరమైన జీవితాలను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వమైనా అన్‌ఎయిడెడ్ అధ్యాపకుల సర్వీసును క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రతను కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించేలా కనీస వేతన స్కేళ్లను వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. అధ్యాపకులు అంబేద్కర్, నానిబాబు, సుబ్బారావు, లక్ష్మీకుమారి, మమతాకుమారి, ప్రవల్లిక పాల్గొన్నారు.

విజిలెన్స్ ఎస్పీగా శ్రీరామ్‌బాబు బాధ్యతలు



ఏలూరు క్రైం, సెప్టెంబరు 5 : జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజినల్ ఆఫీసర్ (విజిలెన్స్ ఎస్పీ)గా అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీరామ్ బాబు గురువారం ఏలూరు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. 1989 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన శ్రీరామ్‌బాబు గుంటూరు రేంజ్‌లోని పలు ప్రాంతాల్లో సీఐగా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో డీఎస్పీగా విధులను కొనసాగించారు. ప్రకాశం జిల్లా రీజినల్ ఇంటిలిజెన్స్ అధికారిగా విధులను కొనసాగిస్తూ సాధారణ బదిలీల్లో ఆయనను ఏలూరు జిల్లా ఆఫీసర్‌గా నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ (విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్) హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. విజిలెన్స్ అధికారులు, సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేస్తున్న 12 మంది అధికారులను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా పరిపాలనా విభాగంలో గత నెల 27న విధుల్లోకి చేరిన శ్రీరామ్ బాబును ఏలూరుకు నియమించారు.

పింఛన్ సొమ్ము చోరీ

ఆగిరిపల్లి, సెప్టెంబరు 5: నెక్కలంగొల్లగూడెం మహిళా పోలీస్ లలితకుమారి పింఛన్ సొమ్మును చేజార్చుకున్నారు. గతనెల 31న శనివారం పింఛనుదారులకు పంచడానికి రూ.రెండు లక్షల 44 వేలు బ్యాంకు నుంచి తీసుకుని రూ.లక్షా 22 వేల పంపిణీ చేశారు. అనంతరం తన ఆరోగ్యం బాగుండక వర్షం కూడా భారీగా కురుస్తుండటంతో తరువాత రోజు ఇద్దామని ఉద్దేశంతో విజయవాడ సమీపంలోని తన స్వస్థలం దేవీనగరకు వెళ్ళిపోయారు. తరువాత వరద కారణంగా ఆది, సోమవారం ఆ డబ్బులు ఇవ్వలేదు. మంగళవారం పింఛన్ పంచటానికి బ్యాగు తెరిచి చూడగా డబ్బు కనబడకపోవడంతో ఆగిరిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పు చేసి పింఛన్‌దారులకు సొమ్ము పంపిణీ చేశారు.

రెక్కలు.. ముక్కలు



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఏలూరు జిల్లా వైసీపీలో వరుస షాక్‌లు
తాజాగా జడ్పీ చైర్మన్ భర్త రాజీనామా
జడ్పీ చైర్మన్ దారెటు ?
పక్కచూపులు చూస్తున్న పలువురు జడ్పీటీసీలు,ఎంపీపీలు
వైసీపీ ఏలూరు జిల్లా సారథిగా దూలం

ఏలూరు జిల్లాలో వైసీపీ ఫ్యాన్ రెక్కలు ముక్కలవుతున్నాయి. వరుస రాజీనామాలు ఆ పార్టీకి షాక్ ఇస్తున్నాయి. ఒక్కొక్కరుగా పార్టీ నుంచి జారు కుంటున్నా నాయకత్వం మాత్రం పోతేపోని అన్నట్టుగానే ఉంది. నిన్నకాక మొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి ఆళ్ల నాని పార్టీ నుంచే నిష్క్ర మించారు. తాజాగా జడ్పీ చైర్మన్ భర్త ఘంటా ప్రసాదరావు పార్టీకి రాజీ నామా చేశారు. కూటమి వైపు వెళ్ళేందుకు దాదాపు సమాయత్తమయ్యారు. ప్రస్తుత ఎమ్మెల్సీ జయమంగళ రామారావుకు కూడా గేలం వేసినట్టు ఇప్పటికే ప్రచారం సాగింది. వీరితో పాటు మరికొందరు జడ్పీటీసీలు, ఎంపీపీలు పక్కచూపులు చూస్తున్నట్టు సమాచారం.

వస్తాం.. వెళ్ళొస్తాం :

గడిచిన రెండు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని మూటకట్టుకున్న వైసీపీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీ వ్యవహార ధోరణి నచ్చక కొందరు రాజీనామాలు చేస్తుంటే రాజకీయ భవిష్యత్తు కోసం ఇంకొందరు పక్క చూపులు చూస్తున్నారు. ఏలూరు నగర వైసీపీ అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్‌తో ఆరంభమైన రాజీనామాల పర్వం కొనసాగుతూనే ఉంది. ఆదిలో ఎన్నికలకు ముందే పార్టీ వ్యవహారాలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసి అక్కడి నుంచి బయటపడిన సీనియర్ నేత ఎంఆర్‌డీ బలరాం, ఆయన సతీమణి ఈశ్వరిలు టీడీపీలో చేరారు. అక్కడి నుంచి ఒకరు తరువాత ఒకరు నేరుగా వైసీపీ నుంచి బయటకు వస్తూనే ఉన్నారు. బొద్దాని శ్రీనివాస్ రాజీనామాతో పాటు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. వ్యక్తిగత కారణాల వల్లే రాజీనామాలు చేస్తున్నట్టు బొద్దాని, ఇటు మంచెం మైబాబు లేఖల్లో పేర్కొన్నారు. తరువాత మాజీ మంత్రి ఆళ్ల నాని వైదొలిగారు. వై.ఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి ఆది నుంచి అత్యంత సన్నిహితంగా ఉన్న ఆళ్ల నాని నిష్క్రమణ ఆ పార్టీకి అతి పెద్ద షాక్. దీని తరువాత మేయర్ నూర్జహాన్ దంపతులు పార్టీకి బైబై చెప్పి సైకిల్ ఎక్కారు. వీరిద్దరి బాటలోనే మరో 19 మంది ఏలూరు కార్పొరేటర్లు ప్రయాణించారు. ఏలూరు నియోజక వర్గంలో వరుసగా చోటు చేసుకుంటున్న పరిణామాలు వైసీపీ పెద్దలను సైతం దిగ్భ్రాంతికి గురిచేసినా ఇదంతా సర్వసాధారణం అన్నట్టుగా వ్యవహరించినట్టు కనిపిస్తుంది.

జడ్పీ చైర్మన్ దంపతుల రూటెటు ?



జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ దంపతులు గడిచిన రెండు రోజులుగా వైసీపీ పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆ మేరకు తాజాగా జడ్పీ చైర్మన్ భర్త, వైసీపీ బీసీ విభాగం అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు పార్టీకి రాజీనామా చేశారు. కొన్నాళ్ళ క్రితం జడ్పీ చైర్మన్ దంపతులిద్దరు, మిగతా మాజీ ఎమ్మెల్యేలతో కలిసి పార్టీ అధ్యక్షుడు జగన్‌తో భేటీ అయ్యారు. పార్టీ స్థితిగతులపై వీరందరితోను అప్పట్లో జగన్ చర్చించారు. అప్పటికే ఆళ్ల నాని పార్టీ నుంచి నిష్క్రమించడం పట్ల జగన్ సైతం అదేంటలా చేశారంటూ నివ్వెరపోయారు. పనిలోపనిగా పార్టీపరమైన చర్చ జరుగుతున్నప్పుడు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఆళ్ల నాని స్థానంలో ఎవరిని నియమించ నున్నామో సూచాయిగా సంకేతం ఇచ్చారు. ఇదే సందర్భంలో ఘంటా ప్రసాదరావునుద్దేశించి మీకు తగినంత గౌరవం లభిస్తుందంటూ సంకేతం ఇచ్చారు. దీంతో అప్పటికే పార్టీ వ్యవహారాలపై ఒకింత గుర్రుగా ఉన్న జడ్పీ చైర్మన్ దంపతులు కాస్త మెత్తపడినట్టే కనిపించినా తరువాత వెంటనే మళ్లీ మనసు మార్చుకున్నారు. వైసీపీ నుంచి బయటపడి నేరుగా జనసేనలో చేరేందుకు కొందరు పెద్దలను సంప్రదించారు. అయితే బీసీ సామాజిక వర్గాన్ని దృష్టిలో పెట్టుకుని జడ్పీ చైర్మన్‌గా అత్యంత కీలకమైన బాధ్యతలను పార్టీలో మరికొందరు పోటీపడినా కాదని అప్పట్లో ప్రసాదరావును సంతృప్తిపరిచేందుకు ఆయన సతీమణి పద్మశ్రీకి పార్టీ ఆ పదవి అప్పగించింది. పార్టీ అధికారం కోల్పోయిన తరువాత అనేక పరిణామాలు వరుసగా చోటు చేసుకుంటున్న తరుణంలో ఒకానొక దశలో ప్రసాదరావుకు జిల్లా అధ్యక్ష పదవి ప్రతిపాదన కూడా జరిగింది. ఆ తరువాత వెంటనే ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకున్నారు. దీంతో పార్టీ వైఖరి పట్ల ప్రసాదరావు తీవ్ర అసహనానికి, అసంతృప్తికి గురయ్యారు. ఇదిలా ఉండగా జడ్పీ చైర్మన్ దంపతులు జనసేనలో చేరేందుకే మొదటి నుంచి ఆసక్తితో ఉన్నారు. ఈ పరిణామాలను అటు టీడీపీ కూడా జాగ్రత్తగా పరిశీలించింది. వాస్తవానికి జడ్పీలో టీడీపీకి ఒక అంకె బలం మాత్రమే ఉంది.మరి అలాంటి పరిస్థితుల్లో జడ్పీచైర్మన్ పార్టీ నుంచి బయటపడితే ఎలా వ్యవహరించాలని కూడా ఒకవైపు జనసేన సీనియర్లు ఇప్పటికే చర్చించారు. వాస్తవానికి ఘంటా దంపతులు చింతమనేనిపై చాలా కాలం నుంచి తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ఒకప్పటి దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి అనుకూలంగా వ్యవహరిస్తూ చింతమనేనిపై అక్రమ కేసులు బనాయించారు. ఈ విధానాన్ని చింతమనేని నేరుగా ఎదుర్కొన్నారు. నువ్వానేనా అనే స్థాయిలో ఎన్నికలకు ముందే వీరి మధ్య సవాళ్ళు నడిచాయి. ఇలాంటి పరిస్థితుల్లో కొందరు టీడీపీ నేతలు చైర్మన్‌ను పార్టీలో చేరేలా అంతర్గతంగా చర్చించినా టీడీపీ పెద్దలు మాత్రం అసలు ఆ వైపే చూడలేదు. ఇప్పటిదాకా జడ్పీ చైర్మన్ హోదాలో ఉన్న ఘంటా పద్మావతి వైసీపీకి ఎలాంటి రాజీనామా చేయలేదు. కేవలం ఆమె భర్త మాత్రమే గురువారం రాజీనామా చేశారు.

ఇక ఎంపీపీలు.. జడ్పీటీసీల వంతు

జిల్లా పరిషత్ చైర్మన్ వ్యవహారం కాస్తా ఇంకా ఒక కొలిక్కి రాకమునుపే ఉమ్మడి పశ్చిమగోదావరిలోని కొందరు జడ్పీటీసీలు పక్క చూపులు చూస్తున్నారు. దాదాపు 15 మంది వరకు రంగు మార్చుకోవడానికి సంసిద్ధంగానే ఉన్నా తమంతట తాముగా ముందుకొచ్చేకంటే మిగతా పార్టీల నుంచి కచ్చితమైన ఆఫర్ వస్తే చూద్దామన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే కొందరు జనసేన వైపు మొగ్గు చూపడం ఆరంభించారు. ప్రత్యేకించి ఒక సామాజిక వర్గానికి చెందిన సభ్యులు ఈ దిశగా ఆసక్తి కనబరుస్తున్నారు. ఎలాగూ జడ్పీ చైర్మన్ పద్మశ్రీ కూడా జనసేన వైపే మొగ్గు చూపుతున్నట్టు ఇప్పటికే ప్రచారం సాగుతున్న నేపథ్యంలో తాము కూడా అదేబాట పట్టాలనే నేపథ్యంలో ఉన్నారు. ఎందుకనంటే జడ్పీటీసీ సభ్యులుగా పార్టీపరమైన చిహ్నంతోనే వీరంతా గెలుపొందారు. అలాగే కొందరు ఎంపీపీలు వైసీపీ నుంచి ఇతర పార్టీల్లోకి జంప్ అవడానికి సిద్ధంగా ఉన్నారు.

దూలంకే పార్టీ పగ్గాలు

కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుకే వైసీపీ జిల్లా అధ్యక్ష పగ్గాలు అప్పగించాలని నిర్ణయించారు. ఈ మేరకు అధికారికంగా నేడో, రేపో ఆదేశాలు వెలువడబోతున్నాయి. జిల్లా పగ్గాలు మోసేందుకు మిగతా వారె వరూ ఆసక్తి ప్రదర్శించకపోవడం ఒక ఎత్తయితే కాపు సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో దూలం వైపే పార్టీ మొగ్గు చూపింది. ఇంతకు ముందు ఖాళీ అయిన కొన్ని జిల్లాల అధ్యక్ష పదవులకు కొందరిని నియ మిస్తూ బుధవారం నాడే వైసీపీ జాబితా ప్రకటించింది.







వస్తున్నా.. వచ్చేస్తున్నా..!

చవితి వేడుకలకు గణనాథులు ముస్తాబయ్యారు..వస్తున్నా అంటూ పూజలు అందుకునేందుకు మండపాలకు బయలుదేరారు.. వివిధ రూపాల్లో కళాత్మకంగా రూపుదిద్దుకున్న గణనాయకుల విగ్రహాలు ముచ్చట గొలుపుతున్నాయి. గురువారం ఏలూరులో విగ్రహాలను తమ గ్రామాలకు తీసుకువెళుతున్న దృశ్యాలివి..







లక్ష్మీపురం దాబా హోటల్ వద్ద ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న వీఆర్వో భాషా..



జీలుగుమిల్లిలో మాంసం దుకాణం వద్ద మాంసం లాగుతున్న కుక్క

దాబా హోటల్‌లో నిల్వ ఆహార పదార్థాలపై వీఆర్వో తనిఖీ

జీలుగుమిల్లి, సెప్టెంబరు 5 : లక్ష్మీపురంలో జాతీయ రహదారి పక్కన నిర్వహించే ఓ దాబా హోటల్‌లో నిల్వ ఆహార పదార్థాలు వాడుతున్న విషయమై వీఆర్వో బాషా ఆరా తీశారు. గురువారం కొందరు స్థానికులు దాబా హోటల్‌కు వెళ్లారు. రోటీలు చికెన్ ఆర్డర్ చెప్పడంతో వారికి పాడై నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు వేడి చేసి ఇచ్చారు. దీంతో హోటల్ నిర్వాహకుడిపై తహసీల్దార్ సందీప్‌కు వినియోగదారులు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై వీఆర్వో బాషా హోటల్‌లో నిల్వ ఉంచి ఆహారం చికెన్ పరిశీలించారు. కొద్ది రోజులుగా అవి ఫ్రిజ్‌లో ఉంచడంతో పాడైనట్లు గుర్తించారు. దీంతోపాటు పగిలిన గుడ్లు, పాచిపోయిన ఉల్లి పాయలు వాడుతున్నారన్నారు.వినియోగదారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని సంబంధిత అధికారులు వర్షాకాలంలో హోటళ్లు, మాంసం దుకాణాల్ని తనిఖీలు చేయాలని స్థానికులు కోరారు

వాగులో కొట్టుకుపోయి మహిళ మృతి

నూజివీడు టౌన్,సెప్టెంబరు 5: తన అన్నను చూద్దామని ఇంటి నుంచి బయలుదేరి వాగు దాటుతూ కొట్టుకు పోయి ఓ మహిళ మృతి చెందిది. మర్సపూడికి చెందిన దొడ్డి లక్ష్మి జంగంగూడెంలోని తన అన్న ఇంటికి శనివారం బయలు దేరింది. జంగంగూడెంలో లెవల్‌బ్రిడ్జ్ వద్ద రామిలేరు దాటుతూ అదుపు తప్పి వాగులో పడిపోయి మృతి చెందింది. రామిలేరులోని ముళ్ల పొదల్లో లక్ష్మి మృతదేహాన్ని గుర్తిం చిన స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు.

క్రైం కార్నర్..

తాడేపల్లిగూడెంలో మహిళ అనుమానాస్పద మృతి



బొబ్బిలి బేబి (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 5: మెడకు తువాలు చుట్టి మహిళ మృతదేహం అనుమానాస్పద స్థితిలో కనిపించిన ఘటన గురువారం తాడేపల్లిగూడెంలో వెలుగుచూసింది. తాడేపల్లిగూడెం 4వ వార్డు బేతావారి వీధిలో నివాసం ఉంటున్న బొబ్బిలి బేబి (50) భర్త మృతి చెందడంతో ఆమె కూరగాయల వ్యాపారం చేసుకుంటూ ముగ్గురు పిల్లలకు వివాహాలు చేసింది. ప్రస్తుతం ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో గురువారం బేబి ఇంట్లో మెడకు తుండు చుట్టి బిగించి విగత జీవిగా పడి ఉంది. కానీ ఇంట్లో రూ.లక్షా 50 వేల నగదు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. అంటే ఎవరో కక్షతోనే హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సుబ్రహ్మణ్యం వివరించారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి పంచనామా చేపట్టారు.

లారీ ఢీకొని బాలుడి మృతి

భీమవరం క్రైం, సెప్టెంబరు 5 : సైకిల్‌పై వెలుతున్న బాలుడిని లారీ ఢీకొన్న ఘటనలో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. భీమవరం వన్ టౌన్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బొక్కావారి పాలెంకు చెందిన బొక్కా శ్రీనుకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు లక్ష్మీశ్రీగణేష్ (13) 9వ తరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాలకు వెళ్ళివచ్చిన అనంతరం తల్లి మంచినీరు తీసుకురమ్మని చెప్పగా సైకిల్‌పై వెళుతుండగా సరిగ్గా పాలకొల్లు వైపు నుంచి భీమవరం వైపు వస్తున్న లారీ ఢీకొట్టడంతో గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

మద్యం మత్తులో ఒంటికి నిప్పు.. చికిత్స పొందుతూ మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 5 :మద్యం మత్తులో తనపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని అగ్ని ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన ఒక లారీ డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతానికి చెందిన వేల్పూరి ఉమామహేశ్వరరావు (49) లారీ డ్రైవర్‌గా చేస్తున్నాడు. భార్య నుంచి విడిపోయి ఒంటరిగా ఉంటున్నాడు. అతిగా మద్యం తాగే అలవాటు ఉంది. ఒంటరి తనంతో తీవ్ర మనస్థాపానికి గురైన అతను ఈనెల 1వ తేదీన తంగెళ్ళమూడి ప్రాంతం జంగారెడ్డిగూడెం రోడ్డులోని జాతీయ రహదారి సమీపంలో ఒక లారీ ఆఫీసు వద్ద మద్యం మత్తులో తనపై పెట్రోలు పోసుకుని నిప్పటించుకున్నాడు. తీవ్ర గాయాలకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందు తున్న అతను గురువారం ఉదయం మృతి చెందాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాగొచ్చి వేధిస్తున్న భర్తపై పోలీసులకు ఫిర్యాదు

భీమవరం క్రైం, సెప్టెంబరు 5 : తన భర్త నిత్యం మద్యం సేవించి వచ్చి కొట్టి వేధిస్తున్నాడంటూ భీమవరం మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన సాలిమట్ల ఎస్తేరురాణి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్తేరు రాణికి అదే గ్రామానికి చెందిన శ్యాంబాబుతో 17 సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు సంతానం. శ్యాంబాబు నిత్యం మద్యం సేవించి వచ్చి వేధిస్తుండటంతో ఆమె అదే గ్రామంలో పుట్టింటికి వెళ్ళిపోయింది. అయితే బుధవారం రాత్రి శ్యాంబాబు మద్యం సేవించి ఎస్తేరురాణి వద్దకు వెళ్ళి కొడుతుండగా అడ్డువెళ్ళిన ఎస్తేరు రాణి నానమ్మపై కూడా దాడి చేశాడు. ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ వీర్రాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు

ఉంగుటూరు,సెప్టెంబరు 5 : ఉంగుటూరు జాతీయ రహదారి వద్ద బస్ కోసం వేచి ఉన్న వృద్ధురాలిని ఏలూరు వైపు వెళుతున్న మోటారు సైకిల్ ఢీకొనడంతో ఉంగుటూరు గ్రామానికి చెందిన కారెం వెంకమ్మకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వెంకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు జరుపుతున్నామని మెరుగైన చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ సూర్య భగవాన్ తెలిపారు.

దాడి ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు

టి.నరసాపురం, సెప్టెంబరు 5: వ్యక్తిపై దాడిచేసి చంపుతామని బెదిరించిన ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఏఎస్సై వి.జయ కుమార్ తెలిపారు. టి.నరసాపురంలోని మెట్టగూడెంకు చెందిన నంద్యాల రమేష్ ఈనెల 3న రోడ్డుపై వెళుతుండగా అదే గ్రామానికి చెందిన గుజరాతి దుర్గతో బెజవాడ గోపి మరికొందరు గొడవ పడుతుండగా పోలీ సులకు సమాచారం ఇవ్వడంతో గోపి మరో ఐదుగురు చంపుతామని బెది రించారని, ఈనెల 4న బాధితురాలు దుర్గతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళు తుండగా దాడిచేసి కొట్టారని ద్విచక్రవాహనం తాళాలు లాక్కున్నారని రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.





పరిశీలిస్తున్న పోలీసులు.. భర్తతో సత్యవతి (ఫైల్)

అనుమానంతో భార్యను కడతేర్చిన భర్త

ఉండి సెప్టెంబరు 5: అనుమానంతో నిద్రిస్తున్న భార్యను నిద్రలోనే కడతేర్చాడు భర్త..తలదిండుతో నొక్కి చంపివేశాడు. ఉండి మండలం కలిగొట్ల గ్రామానికి చెందిన గొల్ల చిరంజీవి గల్ఫ్ వెళ్లి వచ్చాడు. ప్రస్తుతం లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ ఆటో నడుపుకుంటున్నాడు. భార్య సత్యవతి వలంటీరుగా పనిచేసేది. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు 7వ తరగతి, చిన్న కుమారుడు 3వ తరగతి చదువుతున్నారు. భార్యను అనుమానిస్తూ తరచూ భర్త గొడవపడేవాడు.ఈనెల 4వ తేదీ బుధవారం ఇంట్లో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. గురువారం అర్ధరాత్రి ఆమె నిద్రిస్తుండగా తలదిండుతో నొక్కి చంపివేశాడు. అనంతరం అతను పురుగుల మందు సేవించడంతో భీమవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఉండి ఎస్ఐ నజీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 5: అక్రమంగా మద్యాన్ని రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 167 సీసాల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు పట్టణ సీఐ మూర్తి తెలిపారు. వాహన తనిఖీలు చేస్తుండగా ఒక నిందితుడ్ని అదుపులోకి తీసుకొని 167 సీసాల మద్యా న్ని స్వాధీన పర్చుకొని అతడ్ని కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల పాటు న్యాయమూర్తి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ఆలయాల్లో వనమహోత్సవం



మాచేనమ్మ ఆలయం వద్ద మొక్కలు నాటుతున్న సహాయ కమిషనర్

ఆచంట, సెప్టెంబరు 5: వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆచంటలోని రామేశ్వరస్వామి, కొడమంచిలిలోని సర్వేశ్వరస్వామి, పెదమల్లం మాచేనమ్మ ఆలయం వద్ద ఆలయ అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ వి. వెంకట సుబ్బారావు, తనిఖీదారు వర్ధినీడి వెంకటేశ్వరరావు, ఆలయ ఈవో వి. రాము పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

పెనుగొండ, సెప్టెంబరు 5: సిద్ధాంతం గ్రామం నుంచి ఘటాల దిబ్బ వరకు ఉన్న గరగాలమ్మ డ్రెయినేజీ ముంపు ప్రాంతాన్ని ఎమ్మెల్యే పితాని తనయుడు పితాని వెంకట్ పరిశీలించారు. డ్రెయినేజీ కారణంగా పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని ఈ కాల్వ తవ్వకం పనులు చేపట్టాలని స్థానికులు ఆయనను కోరారు. ఇప్పటికే డ్రెయినేజీ ఆక్రమణకు గురైందని స్థానికులు తెలిపారు. తవ్వకాల పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి గనిరాజు, ఎంపీటీసీ పితాని శేఖర్, కట్టా శ్రీనివాసు, కౌరు శ్రీరామమూర్తి, బొబ్బిలి శ్రీను, దార్లంక మారుతి పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీ రామారావు మృతికి సంతాపం

ఆచంట, సెప్టెంబరు 5: ఆచంట మాజీ జడ్పీటీసీ బండి రామారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన సంతాప సభ గురువారం స్థానిక రైతు సంఘం భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పితాని తనయుడు వెంకట్, కేతా మీరయ్య గణేషుల సత్తిబాబు, చిలుకూరి సీతారామ్, ప్రభాకర్, బీకే, గుర్రాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాసవిక్లబ్ సేవలు విస్తృత పర్చాలి

నరసాపురం టౌన్, సెప్టెంబరు 5: వాసవిక్లబ్ సేవల్ని విస్తృత పర్చాలని క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షులు ఆర్.రవిచంద్రన్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని అప్పనప్లాజాలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.

ఉధృతంగా బొండాడ డ్రెయిన్

ఉండి సెప్టెంబరు 5: రహదారులు... డ్రెయిన్స్ వరద నీటితో నిడిపోయాయి. గురువారం కురిసిన భారీ వర్షానికి గ్రామాలలోని రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. పాములపర్రు పంచాయతీ పరిధిలో కొండగూడెం నుంచి పాములపర్రు, ఉండి, వాంద్రం మీదుగా ప్రవహించే బొండాడ డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ డ్రెయిన్‌ని ఆనుకుని వరిచేలు, ఆక్వాచెరువులు సాగు అవుతున్నాయి. దాంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పాత బస్టాండ్ నుంచి బస్ సర్వీసులు

భీమవరం టౌన్, సెప్టెంబరు 5 : భీమవరం రెండో పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించామని డిపో మేనేజర్ పీఎన్ సత్యనారాయణ మూర్తి తెలిపారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భీమవరం నుంచి నరసాపురం, నరసాపురం నుంచి భీమవరం వరకు బస్సు సర్వీసులను ఉదయం 5-15 గంటల నుంచి రాత్రి 7- 30 వరకు 26 ట్రిప్పులు బస్సు సర్వీసులను అందుబాటులో ఉంచామని తెలిపారు. భీమవరం నుంచి ప్రతిరోజు భద్రాచలం కూడా ఆర్టీసీ బస్సు సర్వీసును అందుబాటులోకి తీసుకునివచ్చామని తెలిపారు. ప్రతి పౌర్ణమి రోజున అరుణాచలం యాత్ర స్పెషల్ బస్సులు భీమవరం బస్టాండ్ నుంచి బయలుదేరుతాయని తెలిపారు.

నవంబరులో మహాయాగం

భీమవరం టౌన్, సెప్టెంబరు 5 : నవంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు పాలంగి రోడ్డులోని శ్రీభమిడి సూరన్న లే అవుట్లో శ్రీఉమా రామలింగేశ్వర ట్రస్టు(నెలమూరు) ఆధ్వర్యంలో ఆప్తవాజపేయమ్ (శరద్వాజ పే యమ్) మహాయాగాన్ని నిర్వహిస్తున్నట్లు యాగ నిర్వాహకులు జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) కు ఆహ్వా న పత్రికను అందజేసి కార్యక్రమ వివరాలను వెల్లడించారు. శ్రీచండీ, మహారుద్ర పూర్వక కోటి దీపోత్సవం, కోటి కుంకుమార్చన సహిత మహాయాగాన్ని నిర్వహిస్తున్నామని, ఇది 80వ యాగమని తెలిపారు. మే 15న భీమవరంలో 79వ అతిరాత్ర మహాయగాన్ని చేపట్టామని అన్నారు.

ఉద్యోగం ఇచ్చే స్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 5: మేనేజ్‌మెంట్ కోటాలో విద్యాభ్యాసం ప్రారంభించే విద్యార్థులు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని వాసవీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షకార్యదర్శులు జి.సత్య నారాయణ, సీహెచ్.సుబ్బారావు అన్నారు. స్థానిక కళాశాలలో గురువారం ఎంబీఏ విద్యార్థులకు మొదటి సంవత్సరం క్లాసులను ప్రారంభించారు. పాలకవర్గ కోశాధికారి పి.బాలకాశీయ్య, సంయుక్త కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, టెక్నికల్ డైరెక్టర్ సీహెచ్.అప్పారావు, ప్రిన్సిపాల్ రత్నాకరరావు తదితరులు పాల్గొన్నారు.

9న దివ్యాంగులకు బస్సు పాస్‌ల మేళా

ఇరగవరం, సెప్టెంబర్ 5 : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం దివ్యాంగుల బస్సు పాసుల మేళ నిర్వహిస్తున్నామని డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎన్ఎస్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీ మూడేళ్ల కాల పరిమితికి పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్ బస్సులలో ప్రయాణపు చార్జీలలో 50 శాతం రాయితీ గల బస్సు పాసులు దివ్యాంగులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆధార్‌కార్డు జిరాక్స్, ఒక ఫోటో, సదరం సర్టిఫికెట్ జిరాక్స్, రూ.100 తీసుకొని రావాలన్నారు. మరిన్ని వివరాలకు 98661 77922 నెంబరులో సంప్రదించాలన్నారు.

గ్రీవెన్స్‌లో ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో పరిశీలన

కాళ్ళ, సెప్టెంబరు 5 : పెదఅమిరంలో పంట కాలువలోని నీరు పుంత కోడు మురుగు కాలువలోకి వెళ్ళకుండా కొందరు రైతులు అడ్డుకట్ట వేశారంటూ గ్రామానికి చెందిన ఎస్.బాలాజీ గ్రీవెన్స్‌లో చేసిన ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతాన్ని ఇన్‌చార్జి తహసీల్దార్ నాగార్జున పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

వ్యవసాయంపై రైతులకు ఆసక్తి కలిగించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అందే సూర్యావతి

మొగల్తూరు, సెప్టెంబరు 5: వ్యవసాయంపై రైతులకు ఆసక్తి కలిగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అందే సూర్యావతి కోరారు. గురువారం జరిగిన మొగల్తూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. వ్యవసాయాధికారి రహీమ్ మాట్లాడుతూ సార్వా సాగుకు సంబంధించి మండలంలో 478 ఎకరాల్లో వరినాట్లు వేశారని, వ్యవసాయ పనులు ఆలస్యం కావడం, తుఫాన్‌ల కారణంగా రైతులు సాగుపై అనాసక్తిగా ఉన్నారన్నారు. ఇరిగేషన్ ఏఈ హరికృష్ణ మాట్లాడుతూ కాలువలు సకాలంలో వదిలినా కాలువల్లో నిలిచిపోయిన గుర్రపు డెక్క, చెత్త, చెదారాలు కారణంగా శివారు ప్రాంతాలకు సాగునీరందడం ఆలస్యమైందన్నారు. సమావేశానికి ముందుగా ఇటీవల మృతి చెందిన పేరుపాలెం నార్త్ 2వ ఎంపీటీసీ సభ్యులు కొమ్మూరి సూరయ్య నాయుడు, ముత్యాలపల్లి సర్పంచ్ కొపనాతి పల్లయ్యలకు సమావేశంలో రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈసమావేశంలో జడ్పీటీసీ తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీలు కైలా సుబ్బారావు, కవురు సీతామహలక్ష్మీ పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు నర్సింహస్వామి మృతి

మొగల్తూరు, సెప్టెంబరు 5: మొగల్తూరుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు రాయుడు నర్సింహస్వామి (దత్తుడు) అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన పలు మార్లు ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు.






భీమలాపురంలో ఉపాధ్యాయులకు సత్కారం.. అత్తిలిలో ఎమ్మెల్యే ఆరిమిల్లి సమక్షంలో ఉపాధ్యాయులకు సన్మానం.. పెంటపాడులో వలవల బాబ్జీ ఆధ్వర్యంలో సత్కారం.. భీమవరంలో ఉపాధ్యాయ దినోత్సవంలో మాట్లాడుతున్న జేసీ

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆదర్శం కావాలి

పాఠశాలల్లో ఘనంగా గురు పూజోత్సవం

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5: తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం నాడు భీమవరం భారతీయ విద్యా భవన్ స్కూల్‌లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వారి అనుభవాలను మీ అభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు.

ఆచంట: భీమలాపురం ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్ఎం కానూరి సత్యనారాయణమూర్తితోపాటు పలువురు ఉపాధ్యాయులను పాఠశాల చైర్మన్ కౌరు త్రిమూర్తులు, సర్పంచ్ గుబ్బల మాధవరావు, కళ్యాణి, చల్లా సుబ్బారాయుడు సత్కరించారు. మానవత శాఖ ఆధ్వర్యంలో కూడా గురుపూజోత్సవం నిర్వహించారు.

ఆకివీడు: ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులను ఆకివీడు, ఆదర్శ అభయా, ఆక్వా, లియో క్లబ్‌ల ఆధ్వర్యంలో గురువారం స్థానిక లయన్స్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

భీమవరం ఎడ్యుకేషన్: ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల డైరెక్టర్ డా.ఎం జగపతిరాజు, ఇంజనీరింగ్ మ్యాథ్‌మెటిక్స్ నిపుణులు డా.సి నాగబాబేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కెవి మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పెనుమంత్ర: పెనుమంత్ర మండల పరిషత్ కార్యాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నీలం రామ్మోహన్, వాడపల్లి హైగ్రీవచారి, శ్యామల అనే ఉపాధ్యాయులను సత్కరించారు.

ఉండి: ఉండి జడ్పీ హైస్కూల్‌లో పనిచేసి పదవి విరమణ చేసిన పలువురు ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు వై.రామలక్ష్మీ అధ్యక్షత వహించారు. సన్మానగ్రహీతలు చెన్నంశెట్టి ప్రసాద్, తోటకూర సుశీల, ముదునూరి శివరామరాజు, ముదునూరి గోపాలరాజు, గేదెల రామారావు, మాసాబత్తుల రామకృష్ణారావు, నిమ్మల వెంకట సత్యనారాయణలతో పాటు స్థానిక ఇంగ్లీషు ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావులను సన్మానించారు.

పాలకొల్లు అర్బన్ / పాలకొల్లు రూరల్: చాంబర్స్ కళాశాలల్లో సంస్కృత కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ సోమంచి సత్యనారాయణ మూర్తి, నందుల సీతారామారావులను ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు, చైర్మన్ కారుమూరి నరసింహారావు, కలిదిండి రామరాజు తదితరులు పాల్గొన్నారు. ఎస్ఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజ రాజేశ్వరి ఆధ్వర్యంలో సర్వేపల్లి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు

పాలకోడేరు: పాలకోడేరులో కోరుకొల్లు హెచ్ఎం కె మురళీకృష్ణ గరగపర్రుకు హెచ్ఎం డి రాధాకృష్ణ, పెన్నాడ హెచ్ఎం జి సుధాకర్, శృంగవృక్షం హెచ్ఎం పి లత, కోరుకొల్లు హెచ్ఎం ఏబి విజయభారతిలను ఎంపీడీవో నూకల మురళీగంగాధరరావు ఆధ్వర్యంలో సత్కరించారు.

నరసాపురం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రాత్రి అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో 26 మంది ఉత్తమ ఉపాధ్యాయుల్ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీవో అంబరీష్, చైర్మపర్సన్ వెంకటరమణ, వైస్ చైర్మన్‌లు కొత్తపల్లి నాని, కామన నాగిని విచ్చేశారు.

తణుకు: ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల, పురుషుల శాఖ గ్రంథాలయం, తణుకు లయన్స్ క్లబ్‌లలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయినులు టి.సుజాత, సుగుణకుమారిలను సత్కరించారు. ప్రిన్సిపాల్ కెప్టెన్ యు.లక్ష్మీసుందరీబాయ్, టీడీపీ నేత వి.సరళాదేవి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.బలరామకృష్ణ క్లబ్ నాయకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్తిలి: ఉపాధ్యాయ వృత్తికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వన్నెతెచ్చారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులను సత్కరించారు.

పెంటపాడు: చదువు నేర్పే గురువులు దైవం తో సమానమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువులు కల్వచర్ల కృష్ణమోహన్, కొండ్రెడ్డి ఆనందరావు, టీవీ రామకృష్ణ, ఖండబట్టు లక్ష్మణరావుకు పాదపూజ చేసి శాలువా, పూలదండలతో సత్కరించారు. గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, గంధం సతీష్, దాట్ల జగన్నాధరాజు తదితరులు పాల్గొన్నారు. డీఆర్ గోయింకా ప్రభుత్వ డిగ్రీ కళాశా లలో మానవతా జిల్లా నాయకుడు తాడేపల్లిగూడెం మోహన్‌రావు ఆధ్వర్యంలో అధ్యాపకులను, గురువులను సత్కరించారు. ఎంపీపీ దాసరి హైమావతి, ప్రిన్సిపాల్ ఎన్.వెంకటేశ్వరరావు, ఎంఈవోలు శ్రీనివాస్, టీవీ రామకృష్ణ, ఎస్.విజయానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్ : ఏపీ నిట్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ టి.కురుమయ్య, డాక్టర్ వీరేష్‌కుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్ : మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంఈవో వి.హనుమ ఆధ్వర్యంలో 16 మంది ఉత్తమ ఉపాధ్యాయులను, ఆరుగురు విశ్రాంత ఉపాధ్యాయులను, ఇద్దరు ఎమ్మార్సీ సిబ్బందిని, ఒక జిల్లా అవార్డు గ్రహీతను సత్కరించారు. ఎంపీడీవో విశ్వనాద్, ఎంఈవో-2 పీఎంకే జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

యలమంచిలి, సెప్టెంబరు 5: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని లంకగ్రామాలైన కనకాయలంక, బాడవ గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి పి.చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ పశువులు సీజనల్ వ్యాధుల బారినపడితే పాలదిగుబడి గణనీయంగా తగ్గిపోతుందని, ప్రతిరైతూ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నరసాపురం టౌన్, సెప్టెంబరు 5: పట్టణంలో నెలకొన్న సమస్యల్ని పరిష్కరించాలంటూ గురువారం టీడీపీ నాయకులు కమిషనర్ అంజయ్యకు వినతిపత్రం అందించారు. కౌన్సిలర్ పాలూరి బాబ్జీ, జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, కొప్పాడ రవి గురువారం కమిషనర్‌ను కలిసి ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలో శానిటేషన్ అధ్వానంగా మారిందన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేదని, కొన్ని చోట్ల మురికినీరు రోడ్లపైకి చేరుతుందన్నారు. ఫలితంగా దోమలు విజృంభించి ప్రజలు జర్వాల బారిన పడుతున్నారన్నారు. అన్ని వార్డుల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. శుద్ధచేసిన నీటిని మాత్రమే కుళాయిల్లో సరఫరా చేయాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆర్ఎస్ మృతికి సంతాపం

నరసాపురం, సెప్టెంబరు 5: సీపీఎం మాజీ ఎమ్మెల్యే రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) మృతికి సీపీఎం సంతాపం తెలిపింది. ప్రజా సమస్యలపై పోరాడే గొప్ప నాయకుడిని పార్టీ కోల్పోయిందన్నారు. మీరా

పెనుమంత్ర: మాజీ ఎమ్మెల్యే వామపక్షాల ఉద్యమ నేత మంతెన సత్యనారాయణ రాజు మృతి సిపిఎం పార్టీకి తీరని లోటు అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. గురువారం నరసాపురం మండలం చించినాడలో ఆర్ఎస్ మృతి చెందడంతో వామపక్ష ఉద్యమ నేతలు నివాళులర్పించారు.

రైతుల్ని ఆదుకోవాలి

ఆకివీడు, సెప్టెంబరు 5 : భారీ వర్షాలకు ముంపునకు నష్టపోయిన రైతుల్ని అధికార యంత్రాంగం ఆదుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

ఆక్రమణదారులకు నోటీసులు

ఆకివీడు, సెప్టెంబరు 5: ఆక్రమణదారులు వారంలోపు ఖాళీ చేయకపోతే తామే ఖాళీచేసి నగదు వసూలు చేస్తామని నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. అయి-భీమవరంరోడ్డులోని మూలలంక బోదె ప్రక్కన నివసిస్తున్న ఆక్రమదారుల ఇళ్ళకు గురువారం నోటీసులు అంటించి మాట్లాడారు. 73 కుటుం బాలున్నాయని వారు వారంలోపు స్వచ్ఛందం తరలి వెళ్ళకపోతే తామే ఖాళీ చేయిం చడం జరుగుతుందన్నారు. సంఘటనా స్థలానికి సీపీఎం నేతలు రాకుండా పోలీసులు అడ్డుకున్నారని వాపోయారు.

వరద బాధితులకు దుస్తులు

ఆకివీడు, సెప్టెంబరు 5 : ఐఎంఏ ఆధ్వర్యంలో గురువారం విజయవాడ వరద బాధితులకు దుస్తులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వాహనంలో పంపించారు. ఐఎంఏ అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి కలిదిండి మహేష్‌వర్మ, బిలాల్, జంపన సుబ్బరాజు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

తణుకు, సెప్టెంబరు 5 : నరేంద్ర సెంటర్ వద్ద స్వర్ణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వావిలాల సౌజన్యంతో 500 మట్టి వినాయకుని ప్రతిమలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు బి.శేషారావు, ట్రెజరర్ తులసీ, వి.పవన్‌కుమార్, వి.శాంతి ప్రసూన, ఎ.శ్రీనివాసు పాల్గొన్నారు.

కాళ్ళ ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

కాళ్ళ, సెప్టెంబరు 5 : కాళ్ళ ప్రభుత్వాసుపత్రిని జిల్లా వైద్యాధికారి డా.డి మహేశ్వరరావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. శిథిలావస్థలో ఉన్న ఆసుపత్రి భవనంపైకి ఎక్కి పరిశీలించారు. రికార్డులను పరిశీలించి ఆసుపత్రికి వస్తున్న ఓపీ, ఫీవర్ కేసులపై వైద్యాధికారి డా.ఎస్ సునీల్‌తో చర్చించారు. ఆసుపత్రికి వస్తున్న రోగులతో స్నేహపూర్వక వాతావరణంలో మెగలాని సిబ్బందికి సూచించారు. అనంతరం డెలివరీ రూమ్‌లో ఉన్న గర్భిణులతో సంభాషించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కాళ్ళ ప్రభుత్వాసుపత్రి వైద్యులు డా.సునీల్ తెలిపారు. గురువారం ప్రాతాళ్ళమెరక, పల్లిపాలెం, కలవపూడి, మోడీ, ఎస్సీ బోస్ కాలనీ గ్రామాలను కాళ్ళ మండల వైద్యాధికారి డా.ఎస్ సునీల్ పర్యటించారు. హెల్త్ సిబ్బందితో కలిపి ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే, శానిటేషన్, వాటర్ పరీక్షలు నిర్వహించారు.

వాసవీ డైమండ్ సేవా కార్యక్రమాలు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 5 : వాసవీ క్లబ్ వారోత్సవాల్లో భాగంగా వాసవీ క్లబ్ ఆఫ్ డైమండ్ పాలకొల్లు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. గురువారం చిన్నగోపురం వీధిలోని ప్రైవేటు గెస్ట్ హౌస్‌లో జరిగిన కార్యక్రమానికి క్లబ్ అధ్యక్షుడు చింతా కామేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆర్.రవి చంద్రన్ అధికార పర్యటన సందర్భంగా పాఠశాలకు వాటర్ ఫిల్టర్‌ను, లాకుల వద్ద వెంకటేశ్వర స్వామి గుడికి మోటారు పంపు సెట్‌ను, పేద బ్రాహ్మణులకు బియ్యం బస్తా, వృద్ధులకు దుప్పట్లు, ఇటీవల మరణించిన సంస్థ సభ్యుడు రేపాక లక్ష్మణ కుమారుడికి రూ. 15.500 చెక్కును అందించారు.

దాతలు సహకారం అభినందనీయం



ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు విరాళాలు అందజేస్తున్న దాతలు

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 5 : వరద బాధితులకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం జనసేన నాయకుడు తోట గోపి తనయుడు తోట రాజు, పాలూరి వెంకటేశ్వరరావు, గంటా సుబ్రహ్మణ్యం రూ.లక్ష చొప్పున, ఉమామహేశ్వరం గ్రామస్తులు రూ.30 వేలను అందజేశారు. టీడీపీ కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జికి టీడీపీ నాయకులు సుందర రమాదేవి రూ.10 వేలు, ముత్యాల శ్రీనివాస్ రూ.5 వేలు అందజేశారు.

అంబులెన్సు సేవలు ప్రారంభం

తణుకు, సెప్టెంబరు 5: అంబులెన్సు సేవలను అత్తిలిలో మానవత సంస్థ నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. అత్తిలి మానవత సేవా సంస్థకు విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరి ఎంపీ లాండ్స్ నుంచి రూ.18 లక్షల చేసే అంబులెన్స్‌ను సమకూర్చగా ఎమ్మెల్యే ఆరిమిల్లి గురువారం ప్రారంభించారు. మానవత అధ్యక్షుడు, ఎం.బాలకృష్ణరాజు, జిల్లా కన్వీనర్ జి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం మాసోత్సవాలు

కాళ్ళ, సెప్టెంబరు 5 : కోపల్లె గ్రామంలో ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులు పిల్లలు తీసుకోవల్సిన పోషకాలు గురించి, ఆకుకూరల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈనెల 1వ తేదీన నుంచి 30 వరకు ఈ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె సూర్యకుమారి తెలిపారు.

అత్తిలి: కొమ్మరలో గురువారం ఈసీసీ డే నిర్వహించారు. చిన్నారులకు విజ్ఞానం తోపాటు, విద్యకు ప్రాధాన్యత ఇస్తూ, పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ పి మహాలక్ష్మి అన్నారు. చిన్నారులు, తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గరగపర్రులో అవినీతిపై విచారణ జరిపించండి

పాలకోడేరు, సెప్టెంబరు 5 : గరగపర్రు పంచాయతీలో కార్యదర్శులు వ్యవహరించిన తీరుపై, అవినీతిపై ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న పనులపై విచారించి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో మురళీగంగాధరరావుకు గురువారం నాడు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. గరగపర్రు పంచాయితీలో సెక్రటరీగా పనిచేసిన రాజేష్, లక్ష్మీ హయాంలో పంచాయతీ కుంటుపడిందన్నారు. స్వీపర్‌గా పనిచేస్తున్న ఓ మహిళ బిల్లులు వసూలు చేయడంతో పాటు ఆమెను ప్రశ్నించినందుకు తమపైనే తప్పుడు ఆరోపణలు చేస్తుందని వారు ఎంపీడీవో వద్ద వాపోయారు. వీటన్నింటిపై విచారణ చేయించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో గ్రామ టీడీపీ నాయకుడు ఇందుకూరి బలరామకృష్ణంరాజు, దొండపాటి దేవదాసు, ఏసు, ఎం శ్రీనివాస్, సీతారామయ్య, గొర్లె వెంకన్న, నారాయణరాజు, సతీష్ ఉన్నారు.

డీఆర్‌జీ లో ఎన్‌సీసీ సెలక్షన్స్

పెంటపాడు, సెప్టెంబరు 5 : డీఆర్ గోయింకా కళాశాలలో గురువారం 19 ఆంధ్రా బెటాలియన్ అధికారి కుల్వీందర్, కళాశాల ఎన్‌సీసీ అధికారి ఎంవీ ప్రేమసాగర్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ సెలక్షన్స్ నిర్వహించారు. కళాశాల నుంచి మొత్తం 26 మంది ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

మట్టి వినాయకుడి ప్రతిష్ఠ

పెంటపాడు, సె ప్టెంబరు 5 : కె.పెంటపాడులో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గంధం సతీష్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమను తయారు చేశారు. పెంట్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పి.శేఖర్ పాల్గొన్నారు

టీడీపీ నేత కుటుంబానికి రూ.5 లక్షల సాయం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 5: పెదతాడేపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నేత పసుమర్తి చందు సంస్మరణ సభ గురువారం మాగంటి కళ్యాణ మండపంలో నిర్వహించారు. చందు కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలిసి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రూ.ఐదు లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజ నేయులు, టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, సర్పంచ్ పోతుల అన్నవరం, తదితరులు చందు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళుల ర్పించారు.

వ్యాపారాభివృద్ధిలో బీఓఐ అగ్రగామి

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 5: వ్యాపారాభివృద్ధిలో బ్యాంక్ ఆఫ్ ఇండియా అగ్రగామిగా కొనసాగుతుందని తాడేపల్లిగూడెం శాఖ చీఫ్ మేనేజర్ పీఎన్ఎస్ఆర్ బాబు అన్నారు. బ్యాంకు ఆఫ్ ఇండియా 119వ వార్షికోత్సవం స్థానిక బ్రాంచిలో గురువారం నిర్వహించారు. కేక్ కట్ చేశారు.






విజయవాడ వెళుతున్న వాహనానికి జెండా ఊపుతున్న కలెక్టర్ నాగరాణి.. సూర్యమిత్ర ఎగ్జిమ్ తరపున ఆహారం తీసుకెళుతున్న వాహనానికి జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు, యర్రింకి సూర్యారావు.. పాలకొల్లులో బియ్యం బస్తాల లారీలను విజయవాడ పంపుతున్న తహసీల్దార్ దుర్గా కిషోర్, రెవెన్యూ సిబ్బంది... ఆహార ప్యాకెట్లతో విజయవాడ వెళుతున్న స్వర్ణాంధ్ర బస్సు

వరద బాధితులకు చేయూతనిద్దాం

భారీగా ఆహార పదార్థాలు సమకూర్చుతున్న దాతలు

నరసాపురం, సెప్టెంబరు 5: కష్టకాలంలో ఉన్న వరద బాధితులకు ఆపన్నహస్తం అందించేందుకు ప్రతి ఒక్కరూ స్పందించాలని జిల్లా కలెక్టర్ నాగరాణి పిలుపునిచ్చారు. గురువారం జనసేన ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం సిద్ధం చేసిన నిత్యావసర వస్తువుల వాహనాలను ఎమ్మెల్యే నాయకర్‌తో కలిసి జెండా ఊపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎంత చేసినా బాధితుల కష్టం తీరదన్నారు. సర్వం కోల్పోయిన వారికి అన్ని రకాలుగా చేయూతనివ్వాలన్నారు. దీనికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో అంబరీష్, పొత్తూరి రామరాజు, మేకల సతీశ్, వలవల నాని, ఆకన చంద్రశేఖర్, జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజులు పాల్గొన్నారు.

10వేల ఆహార ప్యాకెట్లు

వరద బాధితుల కోసం స్వర్ణాంధ్ర విద్యా సంస్థలు స్పందించాయి. బాధితుల కోసం 10వేల భోజన ప్యాకెట్లు, బిస్కెట్‌లు, వాటర్ బాటిళ్ళతో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు విజయవాడ వెళ్లారు వీరి వాహనానికి తహసీల్దార్ రాజరాజేశ్వరి జెండా ఊపారు. కార్యక్రమంలో చైర్మన్ కొండవీటి సత్యనారాయణ, కోశాధికారి త్రినాద్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, పీవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: జనసేన పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు భీమవరం సూర్యమిత్ర ఎగ్జిమ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అధినేత డాక్టర్ యర్రింకి సూర్యారావు ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు 5 వేల బిర్యాని ప్యాకెట్లు, 5 వేల దుప్పట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రామాంజనేయులు పాల్గొని ఆహార ప్యాకెట్లు పంపిణీ చేసే వాహనానికి జెండా ఊపి ప్రారంభించారు.

ఉండి: ఎన్ఆర్‌పిఅగ్రహారం జైబీమ్ యూత్ ఆధ్వర్యంలో ట్రినిటి లూథరన్ చర్చి సంఘ సభ్యుల సహకారంతో బాధితుల కోసం 1000మందికి పాలు, పండ్లు, బ్రెడ్స్‌ను తరలించారు. వీటిని తీసుకుని యూత్‌సభ్యులంతా వ్యాన్‌లో స్వయంగా అందించడానికి విజయవాడ వెళ్లారు.

ఐదు వేల బస్తాల బియ్యం

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 5 : విజయవాడ వరద బాధితులకు పాలకొల్లు నియోజకవర్గ రైస్‌మిల్లర్లు ముందుకు వచ్చారు. 25 కిలోల బియ్యం చొప్పున ఐదు వేల బస్తాలను మట్టపర్రు, అడవిపాలెం గోదాముల నుంచి గురువారం లారీల ద్వారా పంపించినట్లు తహసీల్దార్ యడ్ల దుర్గాకిశోర్ తెలిపారు. లారీల వెంట వీఆర్వోలను పంపించారు. పోడూరు తహసీల్దార్ సయ్యద్ ఫజల్, డిప్యూటి తహసిల్దార్లు ఐవీవీ సత్యనారాయణ, డి.రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాళ్ళ: జువ్వలపాలెం గ్రామంలోని శ్రీభార్గవ్ ఫ్యామిలీ రెస్టారెంట్ యాజమాన్యం వరద బాధితులకు తమ వంతు సాయంగా 1000 ఆహారపొట్లాలు, వాటర్ బాటిల్స్, పండ్లు విజయవాడ సింగ్‌నగర్ ఏరియాలో పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆ ప్రాంత వాసుల పడుతున్న బాధలు చూసి చలించిపోయామని బాధను వ్యక్తపరిచారు.

పెంటపాడు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లారెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులు మూడు వేల మందికి ఆహార పొట్లాలను పంపారు. అధ్యక్షుడు డి.వేణుగోపాలరెడ్డి, కె.లక్ష్మణరెడ్డి, టి.వెంకటరెడ్డి, జి.లక్ష్మణిరెడ్డి, చంటిరెడ్డి, ఎన్.చినగోపిరెడ్డి, ఉపసర్పంచ్ కె.ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

తణుకు: విజయవాడ వరద బాధితులను ప్రతి ఒక్కరు ఆదుకోవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. రాధాకృష్ణ ఆదేశాలు మేరకు గురువారం వరద బాధిత కుటుంబానికి 25 కేజీలు బియ్యం ఉచితంగా ఇచ్చేందుకు ఎఫ్‌సీఐ గొడౌన్ నుంచి 10 వేల 8 బస్తాలను పది లారీలలో విజయవాడకు తరలించారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి ఆర్థిక సాయంతో 50 వేల మంచినీటి బాటిళ్ళను వ్యాన్ ద్వారా పంపించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కె.వెంకటకృష్ణ, తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ, డిప్యూటీ తహసీల్దార్ కె.ఉదయభాస్కర్, ఎస్‌వీఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.